క్లుప్తంగా

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఇట్యాల, బీబ్రా, కుంచవెల్లి, చినరాస్పెల్లి, కల్వాడ పాఠశాలల్లో మంగళవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు సభ్యత్వ నమోదు చేయించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుమురం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ప్రయోజకులు కావాలని ఎస్సై సతీశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పోలీస్ మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సురేశ్, సాగర్, హెచ్‌ఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అదనపు సీఐ సతీశ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిలాటిగూడ, ఈదులవాడ గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సై శ్యాంరావు, పోలీస్ సిబ్బంది సురేశ్, సాగర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'అచ్యుతానందన్ సేవలు మరువలేనివి'

కాగజ్‌నగర్‌టౌన్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అచ్యుతానందన్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజన్న మాట్లాడుతూ అచ్యుతానందర్ సీపీఎం పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, జాడి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల బారులు

బెజ్జూర్: మండలంలో యూరియా, ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. సబ్సిడీ ధరపై యూరియా అందుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే మండలంలోని వివిధ గ్రామాల రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరుకొని మంగళవారం బారులుదీరారు. వారం రోజుల క్రితం అధికారులు ఇచ్చిన కూపన్లు, రశీదులతో వచ్చి ఎరువులు తీసుకునేందుకు ఎదురుచూశారు. పంట విత్తనాలు వేస్తూ పంట పొలంలో గడపాల్సిన అన్నదాతలు ఎరువుల కోసం గంటల తరబడి కేంద్రం వద్ద బారులుదీరాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

26న 'వికలాంగుల గర్జన' సన్నాహక సదస్సు

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో బుధవారం 'వికలాంగుల గర్జన' సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో లక్షలాది మందితో వికలాంగుల గర్జన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో నాయకులు రేగుంట కేశవరావు మాదిగ, మంత్రి మల్లేశ్, శ్రీనివాస్, రాజు, ఇస్లాంబిన్ హసన్, బన్నమూర్తి పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్‌లో చేరిక

బెజ్జూర్: నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో అర్షద్ హుస్సేన్, దుబ్బుల నానయ్య, బసర్కర్ విశ్వనాథ్‌లతో పాటు పలువురు చేరనున్నట్లు పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించడంతో పాటు, వంట దినుసులు, కూరగాయలు పరిశీలించారు. మండలంలోని చింతగూడ, కోయవాగు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు.

పత్తికి ప్రాణం..!

- జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- పత్తి పంటకు ఊరట
- భారీ వర్షాలు కురిస్తేనే వరి నాట్లు

కౌటాల: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గత నెలలో కురిసిన అడపాదడప వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పత్తి, కంది, సోయాబీన్ పంటలు సాగు చేశారు. కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో మొలకెత్తిన పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, సోయాబీన్ తదితర పంటలు వాడిపోయే స్థితికి చేరాయి. ఈ పరిస్థితుల్లో సోమ, మంగళవారాల్లో జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షం పంటలకు ప్రాణం పోసింది. గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 1.23 లక్షల మంది రైతులు జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో పత్తి పంటను 3.40 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు వాడు పట్టాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడంతో పంటలకు ఎరువులు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుత వర్షాలతో పంట దిగుబడి సైతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలపై దృష్టి..

వర్షం పడడంతో పంటలకు అవసరమైన ఎరువులు వేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు పత్తి పంటలకు ఎరువులు వేయాలని, కలుపు తీయాలని, సోయా పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రైతులు కలుపు తొలగించడంతో పాటు ఎరువులు వేస్తున్నారు. పలువురు రైతులు పత్తిలో కలుపు నివారణ కోసం మందులు పిచికారీ చేస్తున్నారు. కొందరు రైతులు పంట చేనుల్లో వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మంగళవారం జిల్లాలో నమోదైన వర్షపాతం(మిల్లీమీటర్లలో..)..

ప్రాంతం	వర్షపాతం
కాగజ్‌నగర్	22.9
పెంచికల్‌పేట్	9.9
దహెగాం	21.3
బెజ్జూర్	9.2
సిర్పూర్(టి)	15.9
కౌటాల	6.1
చింతలమానెపల్లి	8.6
వాంకిడి	21.4
రెబ్బెన	19.4
లింగపూర్	10.3
తిర్యాణి	10.2
జైనూర్	22.7
ఆసిఫాబాద్	11.9
కెరమెరి	47.9
సిర్పూర్(యూ)	16.9

ఎరువులు వేస్తాం..

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పత్తి పంటకు ప్రాణం వచ్చింది. ప్రస్తుతం కురిసిన వర్షంతో పత్తి పంటలకు ఎరువులు వేయడంతో పాటు మందులు పిచికారీ చేస్తాం. ఈసారి పంట దిగుబడి పెరుగుతుందని ఆశతో ఉన్నాం. భారీ వర్షాలు కురిస్తే వరి నాట్లు వేస్తాం.

– ప్రేమ్‌కుమార్, యాపలగూడ



గురుడుపేటలో పత్తి మొక్కలు

వర్షంతో అన్నదాత హర్షం

కెరమెరి: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అన్నదాతల కుటుంబాలు పొలం పనుల్లో నిమగ్నమయ్యాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 8,210 మంది రైతులు ఉండగా.. 29,321 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. అందులో పత్తి పంటను 26,230 ఎకరాల్లో పండిస్తున్నారు.

పత్తికి అనుకూలంగా..

కొద్ది రోజులుగా ప్రతీరోజు ఏదో ఒక చోట వాన పడుతూనే ఉంది. వర్షం పత్తి పంటకు అనుకూలంగా పడుతుండడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు 10 గంటల లోపు పొలం బాట పడుతున్నారు. ప్రస్తుతం పత్తిలో కలుపు తీయడం, మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ విత్తనాలు నాటడం, ఎరువులు వేయడం, అరకలు దున్నడం, మందు పిచికారీ చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.



పెద్ద సాకడలో కలుపు తీస్తున్న రైతు కుటుంబం

దిగుబడిపై ఆశ..

నాకు 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 16 బ్యాగులు పత్తి వేశాను. ఇప్పటికే నాలుగు సార్లు దవరలు కొట్టగా.. రెండుసార్లు ఎరువులు వేశాను. కలుపు పనులు కొనసాగుతున్నాయి. అనుకున్న విధంగా వాన పడుతోంది. దిగుబడి బాగా వస్తుందని ఆశిస్తున్నా.

– పెందోర్ జలపతిరావు, రైతు, చిన్నసాకడ

శివాజీ జయంతి అధికారికంగా నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆరె సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం, నానాజి, మహేశ్, సంతోష్, సుబ్బరావు, మారుతి, వినోద్, శ్యాంరావ్ తదితరులు ఉన్నారు.

చందాలు వేసుకుని రోడ్డు మరమ్మతు



రోడ్డు మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని దంపూర్ గ్రామం నుంచి కేరిగూడ గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకల సంగతి అటు ఉంచితే కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా మారింది. దీంతో కేరిగూడ గ్రామస్తులు ఇంటికి రూ.500 చొప్పున చందాలు వేసుకుని శ్రమదానం చేసి రోడ్డు బాగు చేసుకున్నారు.

జీవో 49 నిలుపుదల హర్షణీయం

పెంచికల్‌పేట్: టైగర్ కన్జర్వేషన్ జీవో 49 నిలుపుదలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని ఆదివాసీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసీల మనుగడపై ప్రభావం చూపే జీవో 49 పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయి సెంటర్ సార్మేడి పార్తెటి ప్రభాకర్, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు సిడాం మల్లేష్, ఆదివాసీ గోండ్వానా సంఘం అధ్యక్షుడు ఆలం సకారాం, నాయకులు శ్రీనివాస్, మధుకర్, జగదీష్, మధునయ్య, లస్మయ్య, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: 49 జీవోను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయడంతో మండలంలోని జోడేఘాట్‌లో మంగళవారం గ్రామస్తులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాయిసెంటర్ సార్మేడి పెందోర్ రాజేశ్వర్, కుమురం కిరణ్‌రావు, లక్ష్మణ్, జైతు, సోనేరావు తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: జీవో నం.49ను నిలిపివేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ, కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు శ్రీవర్ధన్, బూస శంకర్, ఆత్రం రాజారాం, కొడప విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆదివాసీ నాయకులు

రద్దు వరకు పోరాటం

కెరమెరి: జీవో 49 రద్దయ్యే వరకు పోరాటం సాగిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ, ప్రజాసంఘాల పోరాట ఫలితంగానే జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేశారని, జీవో శాశ్వతంగా రద్దు చేసేవరకు పోరాడుతామని పేర్కొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం



ఎమ్మెల్యే పంపిణీ చేసిన చెక్కులతో లబ్ధిదారులు



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న హరీశ్‌బాబు

ఆసిఫాబాద్‌అర్బన్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం తిర్యాణి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు సరస్వతితో కలిసి పంపిణీ చేశారు. నాయకులు రాజయ్య, గుణవంత్‌రావ్, చంద్రశేఖర్, శ్రీదేవి, కమల, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకానికి దరఖాస్తు చేసుకున్న 58 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశామన్నారు. తహసీల్దార్ మధుకర్, కమిషనర్ రాజేందర్, టీపీవో యశ్వంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మాజీ కౌన్సిలర్లు విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్, శ్యామ్, సుమన్, వంశీ, రెహాన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

దహెగాం: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నృత్యకారిణి అమృతాసింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. పీఎం శ్రీ స్కీంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపిక కావడంతో విద్యార్థినులకు నృత్య కళలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అమృతాసింగ్‌ను పంపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. కాగా ఎస్సై విక్రమ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

పోలీసుల పేరిట వసూళ్లు.. ఒకరి అరెస్ట్

కౌటాల: పోలీసుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న దహెగాం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గణేశ్‌ను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో రిమాండ్ వివరాలను ఆయన వెల్లడించారు. చింతలమానెపల్లి మండలంలోని ఓ ప్రేమ వ్యవహారం కేసులో గణేశ్ పోలీసుల పేరు చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నాడని తెలిపారు. చింతలమానెపల్లి మండలం కర్జెవెల్లి గ్రామానికి చెందిన బాధితుల ఫిర్యాదు మేరకు చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. గణేశ్, బాధితుల నుంచి ఫోన్‌పే ద్వారా రూ. 79 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. గణేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్సైలు నరేశ్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఎడ్లబండే అంబులెన్సు..!

- మెరెగూడ గ్రామానికి రోడ్డు కరువు
- 108 వాహనం వెళ్లలేని పరిస్థితులు
- సకాలంలో వైద్యం అందక గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. మండలంలోని మెరెగూడ గ్రామస్తులు బురద రోడ్డుపై 5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే తప్ప వైద్యసేవలు అందడం లేదు. అత్యవసర సమయాల్లో గ్రామస్తులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామంలో సకాలంలో గ్రామస్తులకు వైద్యసేవలు అందక పలువురు మృత్యువాత పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆదివారం గ్రామానికి చెందిన కుమురం జగ్గయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని మెరెగూడకు తరలించేందుకు అంబులెన్సు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎల్లూర్ నుంచి ఎడ్లబండిపై తరలించారు.



మృతదేహాన్ని బురదరోడ్డుపై ఎడ్లబండిలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు(ఫైల్)

5 కిలోమీటర్లు బురదే..

మండలంలోని ఎల్లూర్ గ్రామపంచాయితీలోని మెరెగూడ గ్రామంలో 230 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బొక్కివాగు ప్రాజెక్టు కట్టపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎల్లూర్ నుంచి మెరెగూడ వరకు రోడ్డంతా బురదమయంగా మారింది. గ్రామస్తులు వైద్యంతో పాటు ఇతర అవసరాలకు సుమారు 5 కిలోమీటర్లు బురదలో ప్రయాణించి ఎల్లూర్, అక్కడి నుంచి పెంచికల్‌పేట్ చేరుకుంటున్నారు.

అత్యవసర సమయంలో తిప్పలు..

అత్యవసర సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బురదలోనే ఎడ్లబండ్లపైన రోగులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. వైద్య సేవలు అందక దారిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారుల వైఫల్యంతో గత నాలుగేళ్లలో సుమారు సు మారు 9 మంది బురదమయంగా మారిన రహదారిపైన వైద్యం కోసం వెళ్తూ ప్రాణాలు కోల్పోయారు.

పలు ఘటనలు..

- గ్రామానికి చెందిన నిండు గర్భిణీ పంచపూలను వైద్య కోసం 5కిలోమీటర్లు ఎడ్లబండిపైన తరలించగా ఆసుపత్రికి చేరేలోపు కడుపులో బిడ్డ చనిపోయింది.
- కట్టికోల రాజన్న అనే యువకుడు జ్వరంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు ఎడ్ల బండిపైన పెంచికల్‌పేట్ పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.
- పార్తెటి శ్రీనివాస్ అనే యువకుడు జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలోనే బురద రోడ్డుపై ఆలస్యం కావడంతో మార్గమధ్యలోనే మృతి చెందాడు.
- పార్తెటి దుర్గయ్య అనే యువకుడు రెండు నెలల క్రితం జ్వరంతో బాధపడుతూ వైద్యం అందక చనిపోయాడు.
- గతంలో దుర్గం పురుషోత్తం జ్వరంతో బాధపడుతూ వైద్యం అందక చనిపోయాడు. దుర్గం తుకారాం, కుమురం జగ్గయ్యలు సైతం వైద్యం సకాలంలో అందక మృతి చెందారు.

ఎడ్లబండే దిక్కు



బురద రోడ్డుతో గ్రామానికి అంబులెన్సు వచ్చే పరిస్థితి లేదు. వైద్యం కోసం రోగులను ఎండ్లబండిపై తరలిస్తున్నాం. సరైన సమయంలో వైద్యం అందక గ్రామస్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నా నేటికీ రోడ్డు నిర్మించలేదు. ఇప్పటికైన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి కష్టాలు తొలగించాలి.

– దుర్గం ప్రవీణ్, యువకుడు, మెరెగూడ

'తెలంగాణ నీటి వాటా కాపాడుకుందాం'

కాగజ్‌నగర్‌రూరల్: గోదావరి నదిలో తెలంగాణ వాటాను కాపాడుకుందామని బీఆర్‌ఎస్వీ జిల్లా కార్యదర్శి ముస్తాఫా, దాసరి నరేందర్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బనకచర్ల ప్రాజెక్టు, ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బలక చర్ల ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు రాజ్‌కుమార్, అజయ్, సల్మాన్, నజీం తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేని రుణమాఫీ చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రైతులకు షరతులు విధించకుండా రుణమాఫీ అమలు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రమేశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్లు దీపక్‌తివారి, డేవిడ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో 15 రోజుల తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి మంగళవారం సమ్మె నోటీసు అందించారు. రాజయ్య, సమ్మయ్య, బాలేశ్, నగేశ్, అశోక్, శంకర్, ఇస్తారి, పద్మ, పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

దహెగాం: ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఏవో రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సొసైటీ ద్వారా ఇప్పటివరకు రైతులకు 10,680 బస్తాలను, డీసీఎంఎస్, హాకా, ఏఆర్‌ఎస్‌కే సెంటర్ల ద్వారా 24,300 బస్తాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 12,000 బస్తాల యూరియా పంపిణీ చేశామన్నారు. నానో యూరియా వాడడం వల్ల అధిక దిగుబడి వస్తుందని పేర్కొన్నారు.



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో